10న వికాస మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఈ నెల 10న మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరిచంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలోని తాడితోట ప్రాంతంలో ఎస్‌బిఐ బ్యాంకు సమీపంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన సుస్వదీప్ ఆగ్రో సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, క్వ్యాస్ ఖోర్ప్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ .12 వేల నుంచి రూ. 35 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10, ఇంటర్, డిగ్రీ, బి టెక్ చదివిన వారు 18 నుంచి 35 ఏళ్ల మధ్యవారు అర్హులని తెలిపారు. బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్‌పోర్ట్ ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

హడలెత్తిస్తున్న బ్లేడ్ బ్యాచ్

- చిరువ్యాపారులే లక్ష్యంగా దాడులు
- డబ్బులు ఇస్తే సరే..లేకుండా బ్లేడ్‌లతో కోతలు
- పట్టించుకోని పోలీస్ యంత్రాంగం
- పనిచేయని సిసి కెమెరాలు

బ్లేడ్ బ్యాచ్ బాధితునికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్ ఫొటో)

చేతిపై బ్లేడ్ గాయాలు

ప్రజాశక్తి - రాజానగరం

ప్రశాంతతకు మారుపేరైయిన రాజానగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. రాత్రి, పగలు అన్నా తేడా లేకుండా వీరి ఆగడాలు సాగిపోతున్నాయి. ఇక రాత్రి పది గంటల దాటితే ఒంటరిగా బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. రోజు రోజుకీ బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నా పోలీసు యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మండల పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన చిరువ్యాపారులు రాజమహేంద్రవరం నగరానికి మోటారు సైకిళ్లపై వెళ్లి హోల్ సేల్ దుకాణాల్లో కూరగాయలు, పండ్లు తదితర కొనుగోలు చేసుకుని గ్రామాల్లో విక్రయాలు చేస్తుంటారు. ఈ చిరువ్యాపారులంతా ప్రతీ రోజు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంటి దగ్గర బయలుదేరి హోల్ సేల్ వ్యాపార కేంద్రాలకు బయలు దేరి సరుకులు కొనుగోలు చేసుకుని తిరిగి గ్రామాల్లో విక్రయాలు చేస్తారు. ప్రస్తుతం బ్లేడ్ బ్యాచ్ దాదాగిరి అంతా చిరువ్యాపారులపైనే పడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి రాజమహేంద్రవరం వెళ్లే చిరువ్యాపారులను బెదిరింపులకు గురిచేయడం డబ్బులు గుంజుకుని వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. ఎదురు తిరిగితే బ్లేడ్‌లతో చీరేస్తున్న సంఘటనలు చిరువ్యాపారులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ బ్లేడ్ బ్యాచ్ దారుణాలు ముఖ్యంగా రాజానగరం నుంచి కానవరం వెళ్లే రోడ్డు, చక్రద్వారబంధం నుంచి శ్రీకృష్ణ పట్నం, దివాన్ చెరువు, రఘునాథపురం వెళ్లే రోడ్లలో నిత్యం కన్పిస్తున్నాయి. చీకటి పడితే ఈ రహదారుల్లో ప్రయా ణం చేయాలంటేనే ప్రజలు హడలెత్తి పోతున్నారు. ఇటీవల ఆయా గ్రామాల రోడ్లలో జరిగిన కొన్ని దాడులకు సంబంధించిన ఉదంతాలు ప్రజలను మరింతగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈనెల 7వ తేదీ తెల్లవారు ఝూమున నాలుగు గంటలకు ఫ్లిప్ కార్డ్‌లో పనిచేస్తున్న యాళ్ల బాబి రాజానగరం కార్యాలయానికి వచ్చి తిరిగి ఇంటికి వెళతున్నా సమయంలో ఇద్దరు వ్యక్తులు ముఖానికి మంకీ క్యాప్‌లు ధరించి బాబి మోటారు సైకిల్‌ను ఆపడానికి ప్రయత్నం చేశారు. అతనికి భయం వేసి మోటారు సైకిల్ వదిలేసి అరుపులు కేకలు వేసుకుంటూ పరుగులు తీశాడు. అయినా బ్లేడ్ బ్యాచ్ అతనిని వదలకుండా వెంబడించి ఇష్టం వచ్చినట్లు బ్లేడ్‌తో శరీరాన్ని కోసేశారు. ఈలోగా స్థానికులు బయటకు రావడంతో వారు అక్కడ నుంచి పారిపోయారు. అయితే కొంత మంది బాధితులు మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. పది రోజుల క్రితం శ్రీకృష్ణపట్నం రోడ్డులో చిరువ్యాపారిని బెదిరించి అతన వద్ద ఉన్న సొమ్మును దోచుకుపోయినట్లు తెలుస్తోంది. అలాగే కానవరం పరిజిల్లపేట రోడ్డులోనే ఇదే మాదిరిగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న చిరువ్యాపారుడిని వెంబడించి మరీ అతని వద్ద ఉన్న సొమ్మును దోచుకుపోయినట్లు సమాచారం. ఈ దాడిని పోలీసులకు తెలియచేసిన తరువాత స్టేషన్ల చుట్టూ తిరిగడం ఇష్టం లేక వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫలితంగా కొన్ని సంఘటలు వెలుగులోకి రావడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

కొరవడిన పోలీస్ నిఘా..

బ్లేడ్ బ్యాచ్ విచ్చలవిడిగా దాడులు చేయడానికి పోలీస్ నిఘా లేకపోవడం ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జాతీయ రహదారి వెంబడి దివాన్ చెరువు, రాజానగరం, లాలాచెరువు సెంటర్లలో ఉన్న సిసి కెమెరాలు పనిచేయడం లేదు. అదేవిధంగా ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయవల్సినవి రాజానగరం జాతీయ రహదారి కలవచర్ల, నరేంద్రపురం, సూర్యారావు పేట కనకదుర్గ సెంటర్, కాకినాడ వెళ్ల ఎడిబి రోడ్, దివాన్ చెరువు శ్రీరాంపురం రోడ్, పాలచర్ల రోడ్, కొవ్వూరు వైపు వెళ్లే జాతీయ రహదారి వైపు, ఆటో నగర్ లో ప్రతీ వీధిలోను, హౌసింగ్ బోర్డు సెంటర్, లాలాచెరువు సెంటర్ జాతీయ రహదారి నాలుగు లైన్ల, క్వారీ రోడ్ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సివుంది. ఇవి 24 గంటలు స్థానిక పోలీస్ స్టేషన్లో పరిశీలిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండడం వలన నేరాల సంఖ్య తగ్గడంతోపాటు బ్లేడ్ బ్యాచ్ అడ్డకట్ట వేయవచ్చుననే అభిప్రాయాలను సాధారణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

బ్లేడ్ బ్యాచ్‌ను నిలువరించడంలో పోలీసులు విఫలం..

బ్లేడ్ బ్యాచ్‌కు చెందిన వ్యక్తులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని పలువురు పేర్కొంటున్నారు. బ్లేడ్ బ్యాచ్‌లు దాడులకు పాల్పడుతున్న సంఘటనలను సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల .ఫ్లిక్ కార్డ్ ఉద్యోగిపై జరిగిన దాడిపై సిఐ వివరణ ఇస్తూ ఆ దాడికి బ్లేడ్ బ్యాచ్ కారణం కాదని, అతనితో పనిచేసే కొందరు వ్యక్తులు వ్యక్తిగత కక్షతోనే ఈ దాడి జరిగిందని ప్రకటించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

చేతిపై గాయాలను ఫొటో తీసుకుంటున్న రాజానగరం పోలీసులు(ఫైల్ ఫొటో)

ఉద్యమ కార్యాచరణపై మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు మధు, అరుణ్, రమణ, వెంకటేశ్వరరావు

విద్యుత్ ఛార్జీల పెంపుపై

9 నుంచి 15 వరకూ ఇంటింటి ప్రచారం

15న వామపక్ష నేతల ప్రజా బ్యాలెట్ నిర్వహణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాబాట పట్టేందుకు ఉద్యమ కార్యాచరణను రూపొందించాయి. విద్యుత్ ఛార్జీల పెంపుదలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ నెల 9 నుంచి 15 వరకూ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టేందుకు నిర్ణయించాయి. ఈ నెల 15వ తేదీన విద్యుత్ ఛార్జీల పెంపుదలపై ప్రజా బ్యాలెట్‌ను నిర్వహించనున్నట్లు వామపక్షాల నేతలు ప్రకటించారు. సిపిఐ కార్యాలయంలో ఆదివారం వామపక్ష పార్టీల సమావేశం సిపిఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎవి రమణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల పెంపుదలపై జరుగుతున్న ఆందోళనల కొనసాగింపుగా ఈ నెల 9 నుంచి 15 వరకూ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 15వ తేదీన ప్రజా బ్యాలెట్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యుత్ విద్యుత్ ఛార్జీల ద్వారా ప్రజలపై పడుతున్న భారాల పరిస్థితిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ అందించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామని చెప్పారు. ప్రతీనెల క్రమం తప్పకుండా ఛార్జీలను పెంచుతున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని 200 యూనిట్లు వరకు అందరికీ ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించిన ప్రస్తుత సిఎం జగన్ రెడ్డి ప్రజలకు చేసిన నమ్మక ద్రోహాన్ని ప్రజల్లోనే ఎండగడతామని అన్నారు. రైతులకు అందించే ఉచిత విద్యుత్తు పథకానికి ఎసరు పెడుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, వృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీల్లో కోత పెడుతున్న విధానాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు టెండర్లు పిలిచారని, ఈ కాంట్రాక్టును అదాని, ఇతర కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం అయ్యిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారనున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఐ నాయకులు కొండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, వి.కొండలరావు, సిపిఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు జోజి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబు

ఘనంగా జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకల్లో ఎంఎల్‌ఎ చంటిబాబు

ప్రజాశక్తి - గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామంలో ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల సచివాలయల కన్వీనర్ దాసరి.రమేష్, వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొన్న చంటిబాబు దేవిచౌక్‌లో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవిచౌక్ నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తనకు ఎంఎల్‌ఎగా అవకాశం ఇచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించడంలో ఇచ్చిన హామీలకు మించి చేయగల్గామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాటి రాంబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, చింతల అనిల్ కుమార్, దాసరి సతీష్, బి.రాంబాబు, కళ్యాణ్, గోకడ చిట్టిబాబు, మడికి మైనర్ బాబు, టి.రాం ప్రసాద్, కర్రి.శివరామకష్ణ, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, తహశీల్దార్ సుగుణ, ఎస్ఐ శివనాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

జిపిఎస్‌ను అంగీకరించేది లేదు: యుటిఎఫ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిలో తీసుకొచ్చిన జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయవర్గం అంగీకరించేది లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి అన్నారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం తూర్పు గోదావరి జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షులు జయకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైసిపి అధినేతగా జగన్ వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నాడని, నేడు అధికారంలోకి వచ్చాక సిపిఎస్ స్థానంలో జిపిఎఫ్‌ను దొడ్డిదారిన ప్రవేశపెట్టారని విమర్శంచారు. ఒపిఎస్ కంటే మెరుగైన విధానాన్ని తాము కోరుకోవడం లేదని, నాటి ఒపిఎస్ మాత్రమే కావాలని కోరుతున్నట్లు చెప్పారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను నమ్మించి మోసం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఏదైతే హామీ ఇచ్చారో దాని ప్రకారమే ఒపిఎస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ మాట్లాడుతూ ఆదోని మండలంలో సమగ్ర శిక్ష ఉద్యోగిగా పని చేస్తున్న అకౌంటెంట్ రమణ గత మూడు నెలల నుంచి ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారమై మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఎంతమంది ఉపాధ్యా యులు పనిచేస్తున్నారనేది తెలుసుకునేందుకు అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించికపోవడం దారుణ మన్నారు. ఈరోజు వరకు చాలా మండలాల్లో గత నెల జీతాలు ఉపాధ్యాయులకు జమ చేయకపోవడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగానే యుటిఎఫ్ భావిస్తుందని పేర్కొన్నారు. రెగ్యులర్‌గా విద్యార్థులకు బోధించే ఇంగ్గీష్ సబ్జెక్టును తగ్గిస్తూ టోఫెల్‌ను ప్రవేశపెట్టడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ 2018 నుంచి చెల్లించవలసిన డిఎ బకాయిలు, పిఆర్‌సి బకాయిల చెల్లింపులు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కమిటి సభ్యులు శంకరుడు, విజయ గౌరీ, రాంబాబు, ఈవిఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్, రమేష్, తాతారావు, రమణ, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత అరుణకుమారి

కొనసాగుతున్న టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరహారదీక్షలు ఆదివారం కొనసాగాయి. **కడియం** మండలంలోని మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్‌లో గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో రిలే నిరహర దీక్ష జరిగింది. ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** నగరంలోని కోరుకొండ రోడ్డులో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలో నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని బల్లిపాడు గ్రామంలో యువగళం ఆధ్వర్యంలో ధర్మస్నానం పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు కాకర్ల సత్యేంద్ర, కంఠమని రామకృష్ణ, సురపనేని చిన్ని, పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని చిక్కాల గ్రామంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీను, కె.రామ్మూర్తి, వి.శివయ్య, కె.వేణు, ఇ.శ్రీను, ఎస్.గంగరాజు, ఎం.రవిచంద్, ఎం.సోమరాజు, ఎం.శివ, జి.వాసు, సిహెచ్.భూషణం, సిహెచ్.బెనర్జీ, కె.రమేష్, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎ.గంగరాజు తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో స్థానిక చెక్‌పోస్ట్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రవి, ఎన్.సత్యనారాయణ, పి.నాగేంద్ర, కె.రాము, పి.జగదీష్, ఇ.రాంబాబు పాల్గొన్నారు.

గోపాలపురంలో కాగడాల ప్రదర్శనలో టిడిపి నేతలు

జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - దేవరపల్లి

తూర్పు గోదావరి జిల్లా జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. మండ లంలోని దుద్దుకూరు గ్రామంలో జన విజ్ఞాన వేదిక తూర్పు గోదావరి జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జెండాను ఎం.మల్లి కార్జునరావు ఆవిష్కరించారు. తొలుతగా వ్యవ సాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామి నాథన్ మృతికి మహాసభ సంతాపం వ్యక్తం చేసింది. మహాసభలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రత్నకిషోర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళు ్లయినా ఇప్పటికీ దేశంలో మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ దృక్పథాలు రాజ్యమేలు తున్నాయని అన్నారు. ప్రభుత్వం వీటిని రూపుమా పడానికి తక్షణం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ సైన్స్ రంగానికి బడ్జెట్లో మరిన్ని నిధులు కేటాయించి, పరిశోధక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వై.పైడియ్య మాట్లాడుతూ ఏ అంశాన్నైనా నిరంతరం ప్రశ్నిస్తూ, శాస్త్రీయ దక్పథం ద్వారా పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం జన విజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షులుగా డాక్టర్ బి. చైతన్య శేఖర్, అధ్య క్షులుగా ఎం. మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా వై.పైడియ్య, కోశాధికారి ఎన్.రవిబాబు, ఉపాధ్యక్షులుగా పిఎస్ఎన్ రాజు, పి.శేషగిరిరావు, షేక్.భగత్, కార్యదర్శులుగా జిటి.వసంతరావు, సిహెచ్.శ్రీరాములు, కె.సురేష్, సమతా కన్వీనర్‌గా పటాన్ షాకిరా, పాలకవర్గ సభ్యులుగా జికె.ఆదినారాయణ రావు, కె.వెంకటరత్నం, ఐ.మణికంఠ, కె.రత్నాజి, కె.దేవి శిరీషలు ఎంపికయ్యారు. ఈ సభలో జి.తాతా రావు, ఉండవల్లి.కృష్ణారావు, పాపోలు కష్ణ, కూచిపూడి నారాయణ, పటాన్ షాకిర పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ నాయకులు

రాష్ట్రంలో అటకెక్కిన ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘా లపై ఉక్కుపాదాన్ని మోపుతూ రాష్ట్రంలో ప్రజాస్వా మ్యాన్ని ప్రభుత్వం అటకెక్కించిందని సిపిఐ జాతీయ నాయకు రాలు అక్కినేని వనజ విమర్శంచారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. అఖరికి మీడియాపైనా మోడీ సర్కార్ ఉక్కుపాదం మోపుతుందని పేర్కొన్నారు. న్యూస్ క్లిక్ జర్నలిస్టులపై దాడి చేసి అక్రమ అరెస్టులు చేసిందని ఇది రాజ్యాంగానికి మాయని మచ్చని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులను, వామపక్ష భావజాలంతో పనిచేస్తున్న ప్రజాసంఘాల నాయకులపై ఎన్ఐఎ ద్వారా దాడులకు పాల్పడటం సిగ్గుచేట న్నారు. కృష్ణ, గోదావరి నదీ జలాల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను సిఎం జగన్ మోడీకి తాకట్టు పెడుతున్నారని విమర్శంచారు. కృష్ణా జలాల అంశంపై తక్షణమే సిఎం అఖిలపక్షం సమావేశం నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో టిడిపి చేసే ప్రతీ పోరాటంలో సిపిఐ భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కె.రాంబాబు, ఆర్.భాస్కరరావు, వి.కొండలరావు, టి.లక్ష్మణ్, సిహెచ్.సునీల్, కె.శ్రీనివాస్ ం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వనజ

విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2023 మార్చి, మే నెలల్లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆదివారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఆర్‌జెడి ఐ.శారద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు తల్లితండ్రులకు డిజి లాకర్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరక్టర్ సతీష్ బాబు, ప్రిన్సిపల్ శ్రీహరి తదితర సిబ్బంది పాల్గొన్నారు. తిరుమల విద్యాసంస్థలలో 2023 మార్చి మరియు మే నెలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో సోమవారం ఉదయం నుంచి ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్స్‌ను తీసుకోవచ్చునని ప్రిన్సిపల్ సతీష్‌బాబు తెలిపారు.

డిజి లాకర్ యాప్‌పై వివరణ ఇస్తున్న ఆర్‌జెడి శారద

అన్నదానంలో కుందుల

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు కుందులకు శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కడియం

ఇటీవల కాలంలో కడియపుసావరం అంబేద్కర్ నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ముత్తాబత్తుల సూర్యానారాయణ, పావనిల కుటుంబానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ రూ.6 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలు, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కుటుంబానికి చెందిన చిన్నారులు బెన్నీ, సుమశ్రీ చదువుకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తాననిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌పిఎల్ జి విజయలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

11న ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి - గోకవరం

ఈ నెల 11న మండలంలోని రంపఎర్రంపాలెంలో జరిగే జెఎఎస్ శిబిరంలో పాల్గొనేందుకు ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు రానున్నారని వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు తెలిపారు గ్రామ కమిటి అధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ అధ్యక్షతన ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11న జరిగే జెఎఎస్ కార్యక్రమంతోపాటు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతీఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాకారపు ధర్మరాజు, అడబాల వెంకటేశ్వరరావు, సరుకుల నానిబాబు, పాలిపి వెంకట రమణ, ఎస్ఎస్ గుప్తా పాల్గొన్నారు. రహాట్స్: 1సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పాటి రాంబాబు.

అవార్డు గ్రహీతను సత్కరించిన గోరంట్ల

ప్రజాశక్తి - కడియం

మోస్ట్ ప్రెస్టీజియస్ నర్సరీ అవార్డు అందుకున్న మునియ్య గారి శ్రీనును ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సత్కరించారు. నర్సరీ రంగంలో గొల్లపల్లి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, తామెళ్ల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని సింగరాజుపాలెం గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు గద్దే.బాలకృష్ణతోపాటు, అదే గ్రామానికి టిడిపి నాయకుడు సుంకవల్లి దుర్గారావులను మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ఆదివారం పరామర్శించారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు గద్దే రవి, వల్లూరి సత్యనారాయణ (సత్తిపండు), బొల్లిన బాబి, అల్లాడ రాజారావు, ముప్పిడి అశోక్, కొలుకులూరి రవికుమార్, కొఠారు నారాయణ, కోడూరి సురేష్, కొఠారు సురేష్, ఘంటా కష్ణ, తదితరులు. ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వెదుళ్ళకుంటలో నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులను, రూ.10,300లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట, జూదం వంటి అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు.

పురుగుల మందు తాగిన మహిళ మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భర్త మందలించాడని మనస్థాపం చెంది పురుగుల మందు తాగిన మహిళ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాలు ప్రకారం.. పేరవరం గ్రామానికి చెందిన సలాది బేబీ పార్వతి(27) ఇటీవల కాలంలో భార్యాభర్తలు ఇరువురికి చిన్న చిన్న మనస్పర్ధలు రావడంతో మనస్థాపాన్ని గురై ఈనెల 6వ తేదీన పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకోవడంతో. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందింది. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

యానాంకు చెందిన బొడ్డు కామేశ్వర రావు అనే వ్యక్తి ఆదివారం యానం నుంచి మద్యాన్ని తరలిస్తుండగా సెబ్ ఎస్ఐ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి 160 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెడ్డి తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కోనవపేట శివారులో సారా బట్టీలపై కొత్తపల్లి ఎస్ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. సారా తయారీదారుడు పరారయ్యాడని, అతనిపై కేసు నమోదు చేసి నిందితుడు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యమందేలా ఒపి

ఐసిడిఎస్ పీడీ జివి.సత్యవాణి

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమానికి ప్రత్యేక కృషి జరుపుతున్నామని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందించి, వారిని ఆరోగ్యంగా ఉంచాలన్నదే ప్రభుత్వ ఆశయమని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జివి.సత్యవాణి తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందిస్తున్నామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు.

జిల్లాలో ఎన్ని కేంద్రాలున్నాయి.

జిల్లాలో 7 ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 14,814 మంది పిల్లలు, 9,293 మంది గర్భిణులు, 8,538 మంది బాలింతలు ఉన్నారు.

కేంద్రాల్లో అందిస్తున్న సేవలు ఏమిటి.

గర్భిణులు, బాలింతలకు వేరుశనగ అచ్చులు, రాగి పిండి, బెల్లం తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నాం. కేంద్రంలో నమోదైన ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామతం అందిస్తున్నాం. గర్భిణులకు సీమంతాలు నిర్వహించడం, పిల్లలకు అన్నప్రాసక చేయించడం, పోషణ వేడుకలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసాం. లబ్ధిదారులు, చిన్నారులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేద్రాలకు వచ్చి పోషకాహారాన్ని తీసుకోవాలని చైతన్యం చేయడమే వీటి ముఖ్య ఉద్దేశ్యం.

ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు.

జిల్లాలో వర్కర్ పోస్టులు, మినీ అంగన్వాడీ పోస్టులు ఖాళీలుండగా వాటి భర్తీకి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. జిల్లాల విభజన తర్వాత సూపర్‌వైజర్ల కొరత వల్ల పర్యవేక్షణకు కొంత ఇబ్బంది ఉంది. పర్యవేక్షణలో సమస్యలు లేకుండా ఉన్న వారికే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాం. వారు తమకు నిర్దేశించిన స్థాయిలో ఈ కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణను సమర్థంగా కొనసాగించేలా ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్నాం.

కేంద్రాల తనిఖీలు ఎలా జరుగుతున్నాయి.

అన్ని ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు విస్తతంగా తనిఖీలు చేస్తున్నాం. సరుకులు, లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. సరుకు నాణ్యత విషయంలో రాజీ పడడం లేదు. సమయపాలన పాటించడం లేదు, మా దృష్టికి వచ్చిన చోట ఆవగాహన కల్పిస్తున్నాం. నెలనెలా నిర్వహించే సమావేశంలోనూ హెచ్చరిస్తున్నాం. పిల్లల గ్రోత్ పెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీకి వెళ్లినప్పుడు ఆ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులను విచారిస్తున్నాం. ఎవరికైనా అందలేదని తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. చాలా చోట్ల పౌష్టికాహారాన్ని ఇంటికి ఇవ్వాలని ఆడుగుతున్నారు. ఇది సరైంది కాదు. లబ్ధిదారులు కూడా సహకరించాలి. అర్హులందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలు, బాలింతలు, గర్భిణిల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.

చిన్నారుల విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం మాత్రమే పెడతారన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో వారు పిల్లలను ఆ సమయానికి పంపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ పూర్వ ప్రాథమిక విద్యాబోధన ఉందనే విషయాన్ని వారు గుర్తించేలా మా కార్యకర్తలతో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయిస్తున్నాం. దీని ద్వారా పిల్లల హాజరును పెంచడానికి చర్యలు చేపడతాం. ఆట, పాటలతో ఒత్తిడి లేకుండా పాఠాలు చెప్తూ వారిలో శారీరక, మానసిక అభివృద్ధికి వారికి తగిన జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం.

అద్దె కేంద్రాల్లో సౌకర్యాలు ఎలా ఉంటున్నాయి.

అద్దె భవనాలకు ఇచ్చే అద్దె కూడా పెరిగింది. వాటిలో సౌకర్యాలు మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిలో తప్పకుండా విద్యుత్, నీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండాలి. అవి లేని భవనాలు ఉంటే వాటిని మార్చుకునేలా కూడా ఆ కేంద్రాల కార్యకర్తలకు సూచిస్తాం.

యానాం వార్తలు

రమాబాయి నగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - యానాం

యానాం మెట్టకూరు రామభాయ్ నగర్‌లో గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి పాల్గొని ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్, గుత్తుల రామారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నూతన కార్యవర్గ సభ్యులు ముఖ్య ఆతిథులను సత్కరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులందరికీ అందచేశారు.

అలజడి సృష్టించిన ఆంబోతులు

ప్రజాశక్తి - యానాం

యానాంలో శ్రీ పద్మ సినిమా థియేటర్ ఎదురుగా ఆదివారం సాయంత్రం రెండు ఆంబోతులు అలజడి సృష్టించాయి. ఒకదానిపై ఒకటి దాడి చేసుకునే క్రమంలో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి ఆంబోతులను రోడ్ల మీదకు రాకుండా అరికట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

అంజమ్మ పార్థివ దేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ తదితరులు

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్ఐ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పోలీసులు అంటే కేవలం కఠినమైన వారుగా మాత్రమే సమాజంలో ప్రజలు భావిస్తూ ఉంటారు. అయితే అది తప్పని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ నిరూపించారు. ఏ ఆధారమూ లేకుండా బిక్షాటన చేసుకుంటూ అనారోగ్యానికి గురై మతి చెందిన ఆవుల అంజమ్మ (38) పార్థివదేహం పట్ల ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు మానవత్వాన్ని చాటిచెప్పారు. ఆమె మృతదేహానికి అంత్యక్రియలను సొంత ఖర్చులతో చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. సామర్లకోటలోని భీమేశ్వర ఆలయం, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో అంజమ్మ, ఆమె భర్త ఆవుల పాలయ్యలు భిక్షాటన చేసుకుంటూ జీవనాన్ని కొనసాగించేవారు. అయితే ఇటీవల అంజమ్మకు ఒక బిడ్డ జన్మించి మృతి చెందింది. తదుపరి ఆమె అనారోగ్యానికి గురైంది. ఆమె వైద్యానికి ఎలాంటి సహకారం అందకపోవడంతో ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెందింది. భర్త ఏమీ చేయలేని స్థితిలో ఉండగా సాయంత్రం వరకు మృతదేహం అలానే ఉండిపోవడంతో స్థానికులు సమాచారంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగరావు మానవతాదృక్పథంతో మృతదేహానికి సొంత ఖర్చులతో అంత్యక్రియలు జరిపించారు. కేవలం శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మాత్రమే పరిమితం కాకుండా ఇలా సమాజ సేవలోనూ పోలీస్ సిబ్బంది ముందుండటాన్ని పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్

ప్రజాశక్తి - చాగల్లు

మీనానగరం గ్రామం పాతపేటకు చెందిన కొక్కిరిపాటి రాజేష్ తండ్రి భాస్కరరావుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను హోంమంత్రి తానేటి వనిత అందజేశారు. బాధితుడు రాజేష్ తన రెండు తుంట్లు సరిగా పనిచేయక పోవడంతో నడవలేని స్థితిలో గత ఆరేళ్లగా బాధపడుతున్నాడు.

ఆయన భాస్కరరావు కొడుకు దీనస్థితిని హోంమంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందించి అండగా నిలిచారు. ఈ సాయంతో రాజేష్ మెరుగైన ఆరోగ్యంతో మంచి జీవ నాన్ని పొందాలని హోంమంత్రి ఆకాంక్షించారు. పంగిడిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లెటర్ ఆఫ్ క్రెడిట్ ధృవపత్రాన్ని తండ్రి భాస్కర్ రావుకు అందించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తానేటి వనిత అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలోని ఐ పంగిడిలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానికీ తేడాను గమనించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 99 శాతం పథకాలను మహిళల పేరుతోనే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కళా రంగానికి ఆచారి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

దివంగత శృంగారం వెంకట అప్పలాచార్యర్ కళా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆదివారం ద్రాక్షారామలో ఏర్పాటు చేసిన ద్రాక్షారామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు ప్రసంగించారు. ద్రాక్షారామ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో పైడా అన్న సత్రం నాటక కళా పరిషత్ అధ్యక్షులు నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. మయూర నాటక కళా పరిషత్ అధ్యక్షులు సత్తి వెంకట రెడ్డి, చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి సదాశివదాస్, కోటిపల్లి అబ్బు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు నరాల రాధాకృష్ణ ముఖ్య అతిథిలుగా పాల్గొని ఆచారి కళలకు కళాకారులకు అదేవిధంగా పత్రికా రంగానికి చేసిన సేవలు గురించి ప్రసంగించారు. తొలుత డా. స్టాలిన్ ఆచారి చిత్రపటానికి, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పెమ్మిరెడ్డి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి, పరిషత్ కార్యదర్శి వై.సరోజ, ఉపాధ్యక్షులు వై. కొండ, కోశాధికారి వేమవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

నేడు యథావిధిగా జిల్లా స్థాయి స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కలెక్టరేట్‌లో యథావిధిగా అక్టోబర్ 9న సోమవారం జిల్లా స్థాయి స్పందన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల, గ్రామ వార్డు సచివాలయం పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నందున అక్కడ అర్జీలను ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

బహుజన సమాజ్ పార్టీతోనే రాజ్యాధికారం సాధ్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు సాకా రాజారావు అన్నారు ఆయన ఆదివారం వేలిచేరులో బాలయోగి కాలనీలో జైభీమ్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య అధ్యక్షతన సమావేశం జరిగింది జిల్లా నాయకులు రాజారావు మాట్లాడుతూ ఓటు హక్కు గురించి, రాజ్యాధికారం గురించి,ఓటు శాతం గురించి తెలియజేశారు.. వెలిచేరు ప్రజలు మనకు రాజ్యాధికారం కావాలి అనే ఆలోచనతో బహుజన పార్టీలో30 మంది చేరారు ఇసుకపాటి సర్వేశ్వరరావు, అంబటి విజయకుమార్, టి.సత్యనారాయణ, బొంత వెంకట్రావు, సాలి శ్రీను, గొసంగి నరేష్, టి.బాలాజీ, ఇసుకపాటి మహేష్, సాలి బాలాజీ తదితరులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరిన బహుజన రాజ్యాధికారం కోసం ప్రయత్నాలు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామ పెద్దలు,మహిళలు, యువత పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

క్రియేటివ్ ఆర్ట్స్-అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నిర్వాహణ లో సంస్కార భారతి ఆధ్వర్యంలో వందే వేద భారతం రాష్ట్ర స్థాయి చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహుమతి ప్రదాన సభ సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమనస బ్రాంచి లో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు, ఏలూరు కు చెందిన చిత్రాలయ అధినేత ఎమ్.రాంబాబును క్రియేటివ్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంజి ఆకొండి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన విజేతలైన చిత్రకారులకు ముఖ్య అతిథులచే బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.మను విహార్, వివి వి.సుబ్రహ్మణ్యం, యు. ఆశీర్వాదమ్, కార్టూనిస్ట్ మాడా రాము తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని ఆనుకుని హై టెన్షన్ విద్యుత్ స్తంభాలుపై పాదులు

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ స్తంభాలకు తీగలకు పాదులు అల్లుకుని స్తంభాల పైకి విద్యుత్ తీగలపైకి ఎగబాకాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఏదో ఒకచోట ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంబడి హై టెన్షన్ విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదుల దృశ్యాలు కనిపిస్తున్నా కనీసం విద్యుత్ శాఖ అధికారులు కాని ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు.

వర్షాకాలంలో పశువులు, చిన్నపిల్లలు పొరపాటున విద్యుత్ స్తంభాలకు పాదులకు తగిలితే విద్యుత్ షాక్ కు గురయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ఇలా స్తంభాలకు తీగలకు పాదుల వేలాడుతూ తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకోవడం లేదని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గాలి, వర్షం వస్తే ఈ సమస్యల వల్ల గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ట్రీ కటింగ్ అంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖకు ఇవి కనిపించడం లేదా అని మండిపడుతున్నారు. ఇటువంటి సమస్యల వల్ల విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడిన తర్వాత గంటల తరబడి విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మత్తులు చేసి వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయడం కంటే ముందుగానే వీటిని గుర్తించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

సాటిలైట్ సిటి విద్యార్థులకు ఇస్రో ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల భాగంగా ఇస్రో నిర్వహించిన కార్యక్రమంలో శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఇస్రో శాస్త్రవేత్తల మన్ననలు పొందారు. సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో సాటిలైట్ సిటీ విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ బహుమతి పొందింది. ఇస్రో జనరల్ మేనేజర్ సైంటిస్ట్ విజయ్ కుమార్ విద్యార్థులను పరీక్షించి వారి ప్రాజెక్టులను విశ్లేషించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ప్రాజెక్టు రూపకల్పనలో విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ సునీల్ కుమార్ విద్యార్థులను అభినందించి మెమెంటో సర్టిఫికెట్ అందజేశారు. ఈ విద్యార్థులు ఇస్రోను ఎప్పుడైనా సందర్శించవచ్చని వారికి అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రోత్సహించిన సర్వేశ్వరరావు, రాజారావు, ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ, సాటిలైట్ సిటీ ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరిని అభినందించారు. శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులను జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈరంకి నారాయణ, రూరల్ ఎంఇఒ అయ్యంకి దుర్గా తులసీదాస్ అభినందించారు.

విద్యార్థులకు మెమెంటోలు అందజేసిన దృశ్యం

ఎస్‌కెవిటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంతరిక్ష వారోత్సవాల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని ఇస్రో మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని పాఠశాల హెచ్‌ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థి నూలు హేమంత్ కుమార్ ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని కెవి కావ్యశ్రీ తతీయ బహుమతి, క్విజ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని కావ్య అమత తతీయ బహుమతిని పొందినట్లు ఆయన తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందచేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ పుప్పాల బాపిరాజుని డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఇవివిఎస్ఎన్.నారాయణ, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఇఒ అయ్యంకి దుర్గా తులసీదాస్ అభినందించారు.

విద్యార్థిన్ని అభినందిస్తున్న అర్బన్ రేంజ్ డిఐ దిలీప్‌కుమార్ తదితరులు

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు SC, ST కోర్టు, రాజమహేంద్రవరం

I.A.No. 114/2021 in O.S.No. 56/2018

Between:
Nekkanti Veeraju
...Petitioner/Plaintiff
AND
Katta Raghu Prasad and Others
...Respondents

12. Katta Anuradha, W/o. late Raghu Prasad, Hindu, aged 59 years, House wife, D.No. 75-7-7, Round Park, Prakash Nagar, Rajamahendravaram.
...12th Respondent/ Defendant

పై నంబరు పిటిషన్‌లో 12వ రెస్పాండెంటు/ డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయు చున్నారు. కావున ది. 18-10-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 08-10-23
ఎం.నవీన్‌కుమార్
అడ్వకేట్, రాజమండ్రి
సెల్: 98484 13708

మహారాజశ్రీ 5వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు రాజమహేంద్రవరం

O.S.No. 816/2020

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.A.S.M.E.C.C. & S.A.R.C., దానవాయిపేట, రాజమండ్రి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, S.A.R.C. Wing.,
...వాది
మరియు
గాదె వీరవెంకట రామసూర్య ప్రభుకృష్ణ ప్రసాద్, తండ్రి: వీర సుబ్రహ్మణ్యం, హిందువు, వయస్సు 36, బిజినెస్, R/o. డో.నెం. 3-2/143, స్పిన్నింగ్ మిల్సు కాలనీ, నెం.2, లాలాచెరువు, రాజమహేంద్రవరం.
...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 13-10-2023 సం॥రం తేదీన వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి పై దావాలో మీ ఆక్షేపణలను ఉన్నచో తెలుపు కొనవలెను. లేని ఎడల సదరు దావా మీ పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.వి.ఎస్.నారాయణస్వామి
రాజమండ్రి, 08-10-23.
కె.ఇందిర, అడ్వకేట్స్, రాజమండ్రి.

చల్లమ్మ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-మామిడికుదురు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామాయణం చల్లమ్మ దంపతులకు గోగనమఠం యుపి స్కూల్ నందు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. హెచ్ఎమ్. బావి సెట్టి నాగశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ఎంపిపి కుసుమ వనజకుమారి, జెడ్పిటిసి సభ్యుడు కె.అంజిబాబు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, వైస్ ఎంపిపి భూపతిరాజు లక్ష్మీ సుబ్రహ్మణ్యం, పి. ఎసిఎస్ ఛైర్మన్ సాగి పిఆర్‌విఎస్ఎస్.నర్సింహవర్మ, భూపతిరాజు సత్తిబాబు రాజు, ఎమ్ఇఒ-1 లక్ష్మీనారాయణ, ఎమ్ఇఒ-2. మోకా వెంకన్నబాబు, పిఎమ్‌సి ఛైర్మన్ వి. సూరిబాబు, మగటపల్లి హైస్కూల్ హెచ్ఎమ్ కె. హనుమంతరావు, లూటుకురు హెచ్ఎమ్ జి.నాగ ప్రసాద్ తదితరులు పాలుగున్నారు.

ఇస్రో ఉద్యోగాల కోసం కెరీర్ గైడెన్స్ ఉండాలి

-పాఠ్యాంశాల్లో అంతరిక్ష విజ్ఞానం చేర్చాలి

-ఘనంగా ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇస్రో ఉద్యోగాల్లో చేరడానికి అనువుగా కెరీర్ గైడెన్స్ రూపొందించడంతోపాటు అంతరిక్ష విజ్ఞానం గురించి విస్తృతంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ఇస్రో కృషి చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో తేజ్ భరత్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో సౌకర్యవంతమైన జీవనం సాగిస్తున్నామంటే అందుకు ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు కారణమన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, టివి, జాతీయ విపత్తుల గురించి ముందుగా తెలుసుకోవడం వంటివన్నీ ఇస్రో పరిశోధనల ఫలితమేనని వివరించారు. అంతరిక్షంలో అగ్రగామిగా ఉంటేనే భవిష్యత్తులో సూపర్ పవర్‌గా ఎదగవచ్చని తెలిపారు. అందుకే చైనా, రష్యా, అమెరికా వంటి దేశాలతో ఇస్రో పోటీ పడుతోందన్నారు. రాజమహేంద్రవరంలో అంతరిక్ష వారోత్సవాలు విజవంతం చేయడంలో కృషి చేసిన అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఎస్‌పి జగదీశ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని, చంద్రయాన్, ఆదిత్య ఎల్1 వంటి ప్రయోగాలతో ఇస్రో అద్భుత విజయాలను నమోదు చేసిందన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను రాజమహేంద్రవరంలో నిర్వహించి స్కూల్ విద్యార్థులను ఆహ్వానించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. శ్రీహరికోట షార్ డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ మాట్లాడుతూ గడిచిన 60 ఏళ్లలో ఎన్నోప్రయోగాలు చేసి విజయాలను నమోదు చేసున్న ఇస్రో భవిష్యత్తులో హ్యూమన్ మిషన్, గగన్ యాన్, చంద్రయాన్ 4, 5, 6 వంటివి ప్రయోగించాల్సి ఉందని, అందుకే భవిష్యత్ తరాలకు అంతరిక్ష విజ్ఞానాన్ని చేరువ చేస్తున్నామన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ సిహెచ్.కృష్ణ మాట్లాడుతూ ఇస్రో సాధిస్తున్న విజయాలను వివరిస్తూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ఎన్. విజయకుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ, ఈ మూడు రోజుల్లో దాదాపు 25 వేలమందికి పైగా విద్యార్థులు సందర్శించారని చెప్పారు. స్పేస్ వాక్ మొదలుకుని ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ అయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, రాజమహేంద్రి విద్యా సంస్థల అధినేత టికె విశ్వేశ్వర రెడ్డి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలాత్రిపుర సుందరి, అక్షర శ్రీ స్కూల్ డైరెక్టర్ టి నాగరత్నం, ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నృత్యప్రదర్శన

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు